అందుబాటులోకి థీమ్ పార్కులు

- ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి
- పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



పార్కులో బుద్ధుని విగ్రహం వద్ద ప్లాంటేషన్ పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ



జీవీఎంసీ అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

మధురవాడ: ప్రజలకు ఆహ్లాదంతోపాటు సేద తీరేందుకు పార్కులు చాలా అవసరమని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. జీవీఎంసీ మధురవాడ జోన్ – 2లోని బక్కన్నపాలెం లచ్చిరాజు లే అవుట్‌లో నిర్మిస్తున్న స్పోర్ట్స్ థీమ్ పార్కు, ఎంఎస్ఆర్ లే అవుట్‌లో నిర్మిస్తున్న బట్టర్ ఫ్లై పార్కులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే పనులు 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు సత్వరమే పూర్తి చేయాలని చెప్పారు. త్వరలోనే ఈ థీమ్ పార్కులు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పార్కులో పచ్చదనం, పెయింటింగ్ పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఆర్ లే అవుట్‌లో ఆకర్షణీయమైన మొక్కలు, వాకింగ్ ట్రాక్ మరమ్మతులతోపాటు ఇతర పనులు సక్రమంగా చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయనతోపాటు ఎస్ఈ శాంసన్ రాజు, ఏడీహెచ్ చక్రవర్తి, జోనల్ కమిషనర్ డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





మధురవాడలో సుందరంగా సిద్ధమైన పార్కులోపలి భాగాలు

అంగన్‌వాడీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తగరపువలస : భీమిలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాళ్ల పోస్టులకు ఈ నెల 15లోగా నేరుగా లేదా పోస్టు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్ట్ అధికారి ఎం.శ్రీదేవి కోరారు. స్థానికంగా నివసిస్తూ 10వ తరగతి పూర్తి చేసి 21 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన వివాహిత మహిళలు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు. వారంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఖాళీల వివరాలు : బి.తాళ్లవలస – 1 (ఎస్టీ), వెల్లంకి (ఎస్టీ).

అంగన్‌వాడీ సహాయకుల ఖాళీల వివరాలు : కురపల్లి (బీసీ డీ), గెద్దపేట (ఎస్టీ), పాతపాలెం (ఎస్సీ), విజయరాంపురం(ఎస్సీ), దిబ్బమీద పాలెం (ఎస్సీ), కొయ్యపేట (ఎస్టీ), వేములవలస (ఎస్టీ), చిప్పాడ – 1 (ఎస్టీ), రామవరం (ఎస్టీ), రొతులపాలెం – 1 (ఎస్టీ), ముచ్చర్ల(ఎస్టీ), కణమాం (ఎస్టీ), పద్మనాభం (బీసీ ఈ), జీవీఎంసీ ఒకటో వార్డు పరిధిలోని వెంపాడ వారి వీధి (ఎస్టీ), రెండో వార్డు మామిడిపాలెం(ఈడబ్ల్యూఎస్), 3వ వార్డు భీమిలి గొల్లవీధి (బీసీ బీ), 6వ వార్డు కొమ్మాది(ఎస్టీ), 8వ వార్డు ఎండాడ – 1 (ఓసీ).

క్లుప్తంగా

602 మందికి వైద్య పరీక్షలు



తునివలస శిబిరంలో వైద్యులు, రోగులు

పద్మనాభం: మండలంలోని తునివలసలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 602 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 69 మందికి కంటి పరీక్షలు చేశారు. వైద్యులు స్వప్న, సంజన, చైతన్య, దీపిక, సౌజన్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర బంగారప్పడు, ఎంపీడీవో బి.శైలజ శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం

తగరపువలస : చిట్టివలస బొగ్గురోడ్డులోని దుర్గాలమ్మ ఆలయ రెండో వార్షికోత్సవం ఈ నెల 10న నిర్వహించనున్నారు. ఆ రోజు చిట్టివలస, చిల్లపేట, సంతపేట, జీరుపేట, నమ్మివానిపేట, కొండపేట, ఆదర్శనగర్, సుభీభవ కాలనీ తదితర గ్రామాల భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించుకోవాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ఆవరణలో అన్నసంతర్పణ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



సిద్ధేశ్వర స్వామి పీఠంలో పూజలందుకున్న పంచముఖ ఆంజనేయ స్వామి

మధురవాడ: మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠంలో వెలసిన పంచముఖ ఆంజనేయ స్వామికి మంగళవారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి సింధూర, జలాభిషేకాలు చేశారు. పువ్వులు, గారెలు, తమలపాకులతో దండలు వేశారు. తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు.

జోన్ – 2 కమిషనర్‌గా లక్ష్మి



మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ కమిషనర్‌గా దాట్ల లక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ పనిచేసిన కొట్యాడ కనక మహాలక్ష్మి మెయిన్ ఆఫీసుకు ఏవోగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో లక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఈమె మెయిన్ యూసీడీ విభాగం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ శ్రీనివాసరావు

భీమునిపట్నం : కీతిస్‌పేట వద్దనున్న సన్ స్కూల్ విద్యార్థులు ఇటీవల విశాఖలో జరిగిన అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చూపారు. 5వ తరగతి చదువుతున్న బి.కోమలి కుమిటే విభాగంలో బంగారు పతకం సాధించగా, రెండో తరగతి చదువుతున్న జి.యువన్ కత విభాగంలో బంగారు పతకం, కుమిటే విభాగంలో వెండి పతకాన్ని సాధించారు. ఈ మేరకు పాఠశాల డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు విద్యార్థులు, కోచ్ రెమోను మంగళవారం అభినందించారు.

పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు



టి.నగరపాలెంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పంచాయతీ పాలకవర్గ ప్రతినిధులు

తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెం, నగరపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లిఖార్జునరావు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 54 మంది విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరాలను సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ ప్రారంభించారు. ఆరోగ్య సంరక్షణ, ఆహార నియమాల గురించి అవగాహన కలిగించారు. దివీస్ లేబొరేటరీ యాజమాన్యం వీరికి సహాయ సహకారాలు అందించింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు ప్రతాప్, మురళీకృష్ణ, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, కె.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జగుపల్లి ప్రసాద్, అక్కరమాని రామునాయుడు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్‌లో జాతీయ రహదారి నుంచి వినాయకుని గుడి వరకు రూ.18 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో బాలాజీనగర్ వాసులకు రహదారి సమస్య తీరిందన్నారు.

తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశం



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన నిర్మాణాత్మక మూల్యాంకనంలో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారన్నారు. చిన్నారులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బడి ఈడు పిల్లలను ప్రాఠశాలలో చేర్పించే ప్రత్యేక డ్రైవ్‌కు అంతా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో నర్సింగ్ వృత్తిలో రాణింపు



ప్రతిజ్ఞ చేస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

కొమ్మాది: సహనం, సేవాభావంతో నర్సింగ్ వృత్తిలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ప్రో వీసీ డాక్టర్ బి.గీతాంజలి అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థినులతో మంగళవారం ప్రతిజ్ఞ చేయించారు. అంకితభావంతో పని చేస్తామని నర్సింగ్ విద్యార్థినులు కొవ్వొత్తులతో ప్రతిజ్ఞ చేశారు.

‘జనసేన నాయకులకు విమర్శించే స్థాయి లేదు’



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పీఎం పాలెం : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రజారంజకంగా పాలిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనను, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును, కార్పొరేటర్లను కనీస ఉనికిలేని జనసేన నాయకులు విమర్శించడం ఆకాశం పైకి ఉమ్మి వేయడం వంటిదేనని వైఎస్సార్‌సీపీ 6వ వార్డు నాయకుడు సియ్యాద్రి కనకరాజు అన్నారు. మంగళవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వార్డులో కనీసం పది మంది మద్దతు కూడా లేని వాళ్లు పాదయాత్ర చేస్తూ ఆరోపణలు చేయడం తగదన్నారు. 2019కు ముందు, సీఎం జగన్ పాలనలో ఆరో వార్డులో జరిగిన అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఇప్పటి నుంచే సర్దుకోవడం మంచిదని హితవు పలికారు. అనంతరం పోతిన యల్లాజీ మాట్లాడుతూ వార్డులో సీఎం జగన్ పాలనలో సాధించిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ లక్ష్మీప్రియాంక ఆధ్వర్యంలో వార్డు ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. దమ్ముంటే జనసేన, టీడీపీ నాయకులు చర్చకు రావచ్చన్నారు. సమావేశంలో జామి శివకుమార్, ఉండా రమణ, పిళ్లా రమణబాబు, సంజీవ్, సీహెచ్ నందు పాల్గొన్నారు.

కులగణన సర్వే వేగవంతం



యాప్‌లో కులగణన సర్వే వివరాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో శైలజ

పద్మనాభం: కులగణన సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో బి.శైలజ ఆదేశించారు. మండలంలోని రెడ్డిపల్లి, తునివలస, నేరెళ్లవలస గ్రామ సచివాలయాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వివరాలను యాప్‌లో పొందుపరచాలన్నారు. ఇళ్ల పట్టాలను త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. అనంతరం ఆమె సచివాలయ రికార్డులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఘనంగా తెలుగు సినిమా ఉత్సవం



హెచ్‌ఎం రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో తెలుగు సినిమా ఉత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. తెలుగు తొలి టాకీ సినిమా భక్త ప్రహ్లాద విడుదలై 92 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మూడు రోజుల పాటు ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ ఆచార్య ఎన్.వి.ఎస్.దుర్గాప్రసాదరావు ఉత్సవాలను ప్రారంభించారు. ముందుగా భక్తప్రహ్లాద చిత్ర దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మానవ విలువలను స్పృశించే సినిమాలను ప్రజలకు చేరువ చేయడానికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజలు మంచి సినిమాలను చూసే సంస్కృతిని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఫిల్మ్ సొసైటీ ప్రతి ఏడాది ఉత్సవాన్ని జరుపుతోందన్నారు. అనంతరం 1955లో విడుదల అయి సంచలనం సృష్టించిన బంగారు పాప చిత్రాన్ని ప్రదర్శించారు. 7వ తేదీ సాయంత్రం జయభేరి చిత్రం, 8న బలగం చిత్రాలను ప్రదర్శించనున్నారు. సొసైటీ సభ్యులు చిన్నారావు, బాబ్జి, చాట్ల బాబూరావు, రెడ్డి ఉషారాణి, అర్చన, కృష్ణారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ఫుట్‌బాల్ పోటీల్లో రన్నర్స్‌గా చిట్టివలస జట్టు



రన్నర్స్‌గా నిలిచిన చిట్టివలస పోలమాంబ జట్టు సభ్యులు

తగరపువలస: ఒడిశాలోని నిరాకార్పూర్‌లో మంగళవారం జరిగిన ఆల్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో చిట్టివలస పోలమాంబ జట్టు రన్నర్స్‌గా నిలిచి ట్రోఫీతోపాటు రూ.15 వేల నగదు బహుమతి గెలుచుకుంది. సోనూపూర్ జట్టుతో జరిగిన ఫైనల్స్‌లో 1 – 0 స్కోర్ తేడాతో రన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జట్టు ప్రధాన కార్యదర్శి అక్కరమాని చినబాబు తదితరులు అభినందించారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



వేరుశనగ కాయల అలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి



కూరగాయల అలంకరణలో మజ్జివలస రాస పోలమాంబ



బంతిపూల అలంకరణలో తాటితూరు పైడితల్లమ్మ

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం వేరుశనగ కాయల దండలు, తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో అలంకరణకు సరగడ రమణమ్మ, కళావతి సహాయ సహకారాలు అందించారు. అమ్మవారిని భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరెడ్డి అలంకరించారు. భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబను నీలం, నలుపు వంకాయలు, ముల్లంగి, క్యారెట్‌లతో అలంకరించారు. అమ్మవారి అలంకరణ, ప్రసాదాల పంపిణీకి కృష్ణంరాజుపేటకు చెందిన డప్పు రాజారావు, రాజేశ్వరి దంపతులు సహాయ సహకారాలు అందించారు. తాటితూరు పైడితల్లమ్మను నిర్వాహకులు రెండు రకాల బంతిపూల దండలతో అలంకరించారు.

ఇళ్ల వద్దే ఓటు వేసే అవకాశం

ఆర్‌డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి భాస్కరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భీమిలి ఆర్‌డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ పరిధిలో నడవలేని స్థితిలో వున్న వృద్ధులు, వికలాంగులకు ఎన్నికల సంఘం తమ ఇళ్ల వద్దే ఓటు వేసే విధంగా అవకాశం కల్పిస్తోందని ఆర్‌డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నడవలేని స్థితిలో ఉన్నవారు తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాల్సిన పరిస్థితి ఉండేదని... ప్రస్తుతం ఆ ఇబ్బంది లేకుండా ఓటు వేసే అవకాశం లభిస్తోందన్నారు. నడవలేని స్థితిలో ఉండేవారు తమ వివరాలను అందిస్తే ఎన్నికల సిబ్బంది వారి ఇంటికి వెళ్లి ఓటు వేయిస్తారని... ఇది చాలా మంచి అవకాశమన్నారు. ఇటువంటి వారి వివరాలను బూత్ లెవల్ అధికారులు సేకరించాలని సూచించారు. ఈ విషయంలో నాయకులు తమకు సహకరించాలని కోరారు. అలాగే 18 సంవత్సరాలు నిండి ఇంకా ఓటర్లుగా నమోదు చేసుకోని వారు వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే ఎన్నికల సమయంలో అన్ని ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. నాయకులు బోని బంగారునాయుడు, యలమంచిలి సూర్యనారాయణ, గంటా నూకరాజు, డీఏఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు బీజేపీ సిద్ధం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్

భీమునిపట్నం: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎస్ మాధవ్ అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో ముఖ్య నాయకులతో నియోజకవర్గ స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచ స్థాయిలో మన దేశ గొప్పదనాన్ని చాటి చెప్పారని, ఆయన చేసిన కృషికి అందరూ అండగా నిలుస్తారని, కేంద్రంలో ఖచ్చితంగా మళ్లీ బీజేపీనే అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో కూడా మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 9, 10, 11న పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. నియోజవర్గ పార్టీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి, పార్టీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. నాయకులు రామ్మోహన్, శ్రీనివాసరావు, దిలీప్‌వర్మ, ఉప్పాడ అప్పారావు, కంటుభుక్త సునీత, పార్వతి పాల్గొన్నారు.

భీమిలిలో జెడ్పీ సీఈవో పోలినాయుడు పర్యటన



గోస్తనీ నదిలో తాగునీటి వనరులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో పోలినాయుడు, తదితరులు

తగరపువలస: జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు తదితర అధికారుల బృందం మంగళవారం భీమిలి మండలంలోని టి.నగరపాలెం, దాకమర్రి పంచాయతీల్లో పర్యటించారు. రానున్న వేసవి దృష్ట్యా గోస్తనీనదిలో తాగునీటి వనరులను పరిశీలించారు. దాకమర్రి గ్రామ సచివాలయం, జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేసి సూచనలు చేశారు. ఆయనతోపాటు డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, భీమిలి ఎంపీడీవో వి.జానకి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చతుర్వేద పారాయణం

సీతమ్మధార : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేద పండితులు సీతమ్మధార ఏఎస్ఆర్ నగర్ కొండపై ఉన్న 108 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రారంభమైన చతుర్వేద పారాయణం మంగళవారం ముగిసింది. భక్తిశ్రద్ధలతో శుక్ల యజుర్వేద పండితులు దాంపర్తి నరేంద్ర వేద పడింతులతో ఈ పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు మాట్లాడుతూ చతుర్వేదం ద్వారా లోక శాంతి కలుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో శంభూ శర్మ, బులుసు సంతోష్‌కుమార్, దాకూరి రామకృష్ణ, గిరి శ్రీనివాస్, ఆలయ ధర్మకర్త ఎ.ఎస్.ఎన్.రాజు, అర్చకులు పాల్గొన్నారు.